
తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శుక్రవారం 11 - 09 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 6

## దళితబంధు రూ.12 లక్షలు ఇవ్వకుంటే..

# కాంగ్రెస్ నాయకుల ఇళ్ల ముందు చావుడప్పు మోగుతుంది

### మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి



- **మూడేళ్లలో దళితుల కసం ఒక్క పథకమైనా అమలు చేశారా**
- **దళిత కుటుంబాలకు రూ.10 లక్షలు ఇచ్చిన కేసీఆర్ దళిత పక్షపాతా..**
- **వారిని రాజకీయంగా వాడుకుంటున్న రేవంత్‌రెడ్డి దళిత పక్షపాతా**
- **ఎమ్మెల్యే సామేల్‌కు దళితులపై నిజంగా ప్రేమ ఉంటే 254 మంది లబ్ధిదారులకు దళితబంధు ఇప్పించాలి**

ప్రజావారధి/మోత్కూరు

కాంగ్రెస్ ప్రభుత్వానికి దళితులపై నిజంగా ప్రేమ ఉంటే దళితబంధు పథకంలో ఇస్తామన్న రూ.12 లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ నాయకుల ఇళ్ల ముందు చావు డబ్బు మోగుతుందని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళిత కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా నిలబడాలన్న లక్ష్యంతో కేసీఆర్ దళితబంధు పథకం తెచ్చి ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చారని, స్థానిక సంస్థల్లో, మార్కెట్ కమిటీ రిజర్వేషన్లు అమలు చేసి వారికి పదవులు కట్టబెట్టి రాజకీయంగా ఎదిగేందుకు తోడ్పడ్డారన్నారు. దళితబంధు ఎగ్గొట్టిన సీఎం రేవంత్‌రెడ్డి దళితులను రాజకీయంగా వాడుకోవడం తప్ప మూడేళ్ల పాలనలో దళిత ప్రజలు, యువకుల ఉపాధి కోసం ఒక్క పథకమైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. అసలైన దళిత ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వమని, చావు డప్పు రేవంత్ రెడ్డి ఇంటి ముందు, గాంధీ భవన్ ముందు కొట్టాలన్నారు. గత రెండు, మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాల న్నింటినీ తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, కేసీఆర్ బీఆర్ఎస్ సైన్యానికి సైగ చేస్తే కాంగ్రెస్ నాయకుల వీపులే డప్పులవుతాయని జాగ్రత్త అని హెచ్చరించారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తిరుమలగిరి మండలాన్ని దళితబంధు పథకంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి రూ.250 కోట్లు దళిత కుటుంబాలకు ఇచ్చిన కిశోర్ దళిత పక్షపాతా లేక దళిత యువకులకు దళిత బంధు పథకంలో మంజూరైన నిధులను వారికి రాకుండా అడ్డుకుంటున్న ఎమ్మెల్యే సామేల్ దళిత పక్షపాతా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ దళితబంధు పథకంలో నియోజకవర్గంలోని 9 మండలాల్లో వందల కుటుంబాలకు ఉపాధి లభించింద న్నారు. ఎమ్మెల్యే సామేల్‌కు నిజంగా దళితులపై ప్రేమ ఉంటే దళిత బంధు పథకంలో మోత్కూరు, అడ్డగూ డూరు మండలాలకు చెందిన 254 మంది లబ్ధిదారు లకు రూ.3 లక్షల చొప్పున వారి ఖాతాల్లో జమ అయిన నిధులను వెంటనే విడుదల చేయిం చాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.12 లక్షలు కూడా దళిత కుటుంబాలకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. మోత్కూరు, అడ్డగూడూరు మండలాల లబ్ధిదారులకు దళితబంధు రాకుండా అడ్డుకుంటున్న దళిత ద్రోహి ఎవరన్నది దళిత కుటుంబాలకు తెలుసునని, దళితబంధుపై స్పందించని ఎమ్మెల్యే ఇంటి ముందు చావు డప్పు మోగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, దళిత విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువుల కోసం అమలు చేసిన పథకాలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అసలైన దళిత పక్షపాతి కేసీఆరా లేక రేవంత్‌రెడ్డినా అన్నది దళితులంతా గమనిస్తున్నారన్నారు. కేసీఆర్ చావు కోరుకుంటున్న ప్రతి ఒక్కరికీ భవిష్యత్‌లో రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు.

# గర్భిణిలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



**ప్రజావారధి/మోత్కూరు**

గర్భిణిలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ బండ రమవిజయ్‌రెడ్డి అన్నారు. మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో గురువారం 9వ జాతీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రం ద్వారా అందుతున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకాలు ఎక్కువగా ఉంటే ఆకుకూరలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని, పిల్లలకు బాలామృతం ఇవ్వాలన్నారు. మంచి ఆహారం తీసుకోవడంతోనే తల్లి ఆరోగ్యంగా ఉంటుందని, తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నట్టయితే సాధారణ కాన్పులు అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ ఎం.పుష్పలత, ఉపాధ్యాయుడు మల్లయ్య, వివో సభ్యులు బండి మానస, అనిత, ఆశావర్కర్ రేణుక, ఏఎన్ఎం అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



# దళితులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

## కాంగ్రెస్ మోత్కూరు మండల అధ్యక్షుడు బాలరాజు

**ప్రజావారధి/మోత్కూరు**

దళితుల ఆత్మగౌరవాన్ని కించపర్చేలా బీఆర్ఎస్ కార్యకర్తలను ఉసిగొల్పిన కేసీఆర్ వెంటనే దళితులకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మోత్కూరు మండల అధ్యక్షుడు రాచకొండ బాలరాజు గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కులతత్వాన్ని రెచ్చగొట్టడం సరైంది కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో దళితుల డప్పు లేనిదే నీ ఉద్యమం లేదని, దళిత సీఎం పేరుతో దళితులను మోసం చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేపై బీజేపీ కులపిచ్చి ఆగడాలకు పాల్పడిన ఘటన మరువక ముందే బీఆర్ఎస్ కూడా కుల అహంకార చర్యలకు పాల్పడటం చూస్తుంటే ఆ రెండు పార్టీలు ఒక్కటేనని అర్థమవుతుందన్నారు. కేసీఆర్ ఫాంహౌస్ వద్ద దళితులు నిరసన తెలిపితే అక్కడ పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడం సిగ్గుచేటని, దళితులపై కేసీఆర్‌కు ప్రేమ ఉంటే వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్, నాయకులు బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి, బద్దం నాగార్జున్ రెడ్డి, గడ్డం సోమనర్సయ్య, లెంకల వేణు, గనగాని నర్సింహ, గడ్డం లక్ష్మయ్య, కందుకూరి మురళి, దాచారం గ్రామశాఖ అధ్యక్షుడు సూరారం నవీన్, ఎస్‌కె.సాజిద్, ఎడ్ల భగవంత్, రంగారెడ్డి, జిట్ట లక్ష్మయ్య, కోమటి జనార్దన్, ఆలకుంట్ల రాజు, ఆలకుంట్ల నర్సింహ, కురిమేటి సైదులు, కురిమేటి విక్రమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరసనలకు పిలుపునివ్వకున్నా అక్రమ అరెస్టులెందుకు..?

## మోత్కూరులో బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు



ప్రజావారధి/మోత్కూరు

కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై ప్రజా వ్యతిరేక విధానాలపై ఎలాంటి నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వకపోయినా బీఆర్ఎస్వీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయించడం పిరికిపంద చర్య అని బీఆర్ఎస్వీ నాయకులు విమర్శించారు. మోత్కూరులో గురువారం పోలీసులు బీఆర్ఎస్వీ మోత్కూరు మండల, పట్టణ అధ్యక్షులు పబ్బు ప్రవీణ్, జంగ శివ, సోషల్ మీడియా అధ్యక్షుడు జిట్ట సాయికుమార్, నాయకులు అన్నందాసు విద్యాసాగర్‌లను ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు అర్థరాత్రి తమ ఇళ్లను ముట్టడించి అరెస్టు చేయాల్సిన అవసరమేముందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అక్రమ అరెస్టులతో ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తలను భయపెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని, ఇచ్చిన హామీలను, ప్రజలను గాలికొదిలేసి ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై, కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పోరాడుతుందని, అక్రమ అరెస్టులకు, కేసులకు భయపడేది లేదన్నారు.

# చాకలి అయిలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ప్రజావారధి/మోత్కూరు

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి చాకలి అయిలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, మండల అధ్యక్షుడు శివార్ల శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చాకలి అయిలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గురువారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని చెరువు కట్ట చౌరస్తాలో అయిలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం పాలనలో భూస్వాములు, పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాడి పేదలకు భూములు పంచిందన్నారు. రజాకార్లను, దొరల ఆగడాలను ధైర్యంగా ఎదుర్కొన్న వీరవనిత అయిలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్, పట్టణ అధ్యక్షుడు నిలిగొండ మత్స్యగిరి, మండల నాయకులు పురుగుల శ్రీనివాస్, మహేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
11 - 09 - 2026

# చాకలి అయిలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తి



❖ సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు

ప్రజావారధి/మోత్కూరు

దొరల పాలనకు, నిరంకుశత్వానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి అయిలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. చాకలి అయిలమ్మ వర్థంతి సందర్భంగా గురువారం మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 ఏళ్ల క్రితమే బడుగు, బలహీన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ధైర్యంగా పోరాడిన గొప్ప యోధురాలు అయిలమ్మ అని కొనియాడారు. చాకలి అయిలమ్మ పోరాటం కేవలం ఒక వర్గానికి సంబందించిన పోరాటం మాత్రమే కాదని, అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కులు, సమానత్వం కోసం సాగిన చారిత్రాత్మక పోరాటమన్నారు. దొరల నిరంకుశ పాలన, అణచివేత, వెట్టిచాకిరికి వ్యతిరేక పోరాట స్ఫూర్తికి ప్రతీకలుగా నిలిచిన మహనీయుల పోరాట వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, గ్రామశాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, చింతకింది సోమరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్, కొంపల్లి నర్సయ్య, ఆళ్ల శేఖరప్ప, పబ్బు చంద్రయ్య, గుంటోజు నర్సింహా చారి, ఎండి.హబీబ్, కొంపల్లి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి అయిలమ్మ వర్ధంతి



ప్రజావారధి/మోత్కూరు

తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి అయిలమ్మ వర్ధంతిని గురువారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొరలు, పెత్తందార్లకు వ్యతిరేకంగా, బడుగు, బలహీన వర్గాలకు అండగా సాగించిన అయిలమ్మ పోరాటం చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి బొడ్డుపల్లి మైసయ్య, అధ్యక్షుడు కూసంపెల్లి యాకయ్య, ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి లక్ష్మయ్య, కార్యదర్శి కూసంపల్లి సోమనర్సయ్య, కోశాధికారి కూసంపెల్లి ఉపేందర్, గౌరవసలహాదారుడు బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కూసంపల్లి కృష్ణ, బొడ్డుపల్లి శివాజీ, బొడ్డుపల్లి రాములమ్మ, కూసంపల్లి లక్ష్మమ్మ, లక్ష్మి, కూసంపల్లి అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
11 - 09 - 2026

# దివ్యాంగ విద్యార్థుల రామోజీ ఫిలిం సిటీ టూర్



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులు గురువారం హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీ టూర్‌కు వెళ్లారు. టూరిస్ట్ స్థలాల సందర్శనలో భాగంగా దివ్యాంగ విద్యార్థులకు విజ్ఞానం, వినోదం కోసం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో విద్యార్థులను టూర్‌కు తీసుకెళ్లినట్టు కాంప్లెక్స్ హెచ్ఎం డి.అరవిందరాయులు తెలిపారు. ఈ పర్యటనలో మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల మండలాలకు చెందిన 30 మంది దివ్యాంగ విద్యార్థులను తీసుకెళ్లామని, రామోజీ ఫిలిం సిటీని సందర్శించిన విద్యార్థులు ఎంతో ఆనందంగా గడిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ షాజహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మోత్కూరు గీత సొసైటీ ఎన్నికల బరిలో 16 మంది

## 3 నామినేషన్లు ఉపసంహరణ

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూర్ గీత కార్మిక సంఘం ఎన్నికల్లో 16 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఎన్నికల అధికారి, కోఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ వి.విజయ్ కృష్ణ గురువారం విలేకరులకు తెలిపారు. సంఘంలో 7 జనరల్ స్థానాలు, రెండు మహిళా డైరెక్టర్ స్థానాలకు 19 మంది నామినేషన్లు దాఖలు చేశారని, నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నట్టు చెప్పారు. 7 జనరల్ స్థానాలకు 13 మంది, 2 మహిళా డైరెక్టర్ స్థానాలకు ముగ్గురు పోటీలో ఉన్నారన్నారు. పోటీలో నిలిచిన 16 మంది అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 15న స్థానిక గీత కార్మిక సంఘం భవనంలో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు ఉంటాయని, పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తామని చెప్పారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
11 - 09 - 2026

# పంట సాగు గుర్తింపుకు డిజిటల్ క్రాప్ సర్వే

## మోత్కూరు వ్యవసాయాధికారిణి కీర్తి

- ఈనెల 30 వరకు రైతులు నమోదు చేయించుకోవాలి
- పంట నమోదు చేసుకుంటేనే కొనుగోలు కేంద్రాల్లో కొంటారు
- కేంద్ర ప్రభుత్వ యాప్‌లో పంటల వివరాలు నమోదు



**ప్రజావారధి/మోత్కూరు**

పంటల సాగు గుర్తింపుకు ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహిస్తుందని మోత్కూరు మండల వ్యవసాయాధికారిణి వడ్డెమాను కీర్తి తెలిపారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాపురం గ్రామంలో గురువారం డిజిటల్ క్రాప్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వానాకాలంలో ఏయే పంటలు సాగు చేశారన్నది గుర్తించేందుకు డిజిటల్ క్రాప్ సర్వే చేస్తుందని, రైతులు ఇప్పుడు పంటల నమోదు చేసుకుంటేనే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొంటారన్నారు. పంటల సర్వే కోసం 13 మంది సర్వేయర్లను గుర్తించి వారితో సర్వే చేయిస్తుందని, రైతులు అందుబాటులో ఉండి పంటల సర్వే చేయించుకోవాలని, ఈనెల 30 చివరి తేది అని తెలిపారు. టెక్నికల్ సమస్య కారణంగా దాచారం గ్రామం అడ్డగూడూరు మండలంలో చూపిస్తుందని, ఆ గ్రామ రైతులు ఏఈవోను సంప్రదిస్తే ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తారన్నారు. శాటిలైట్ ద్వారా జరిగే ఈ సర్వే ఆధారంగా పంటల వివరాలు సంబంధిత కొనుగోలు కేంద్రాలకు వెళతాయని, వాటి ఆధారంగా రైతుల పంట కొంటారన్నారు. సర్వే చేయని పంటను కొనుగోలు సమయంలో మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉండదని చెప్పారు. సర్వేయర్లు ఉదయ్ కిరణ్ అనాజిపురం, మమత బుజిలాపురం, కొమురయ్య, రాజు మోత్కూరు, పాండురంగ పనకబండ, సాయికుమార్ పాటిమట్ల, శ్రీను దాచారం, మహేష్ సదర్శాపూర్, శ్రీను కొండగడప, సత్యనారాయణ దత్తప్పగూడెం, అఖిల ముశిపట్ల, సత్యనారాయణ పాలడుగు, శ్రీశైలం పొడిచేడు గ్రామాల్లో సర్వే చేస్తారన్నారు. సర్వేయర్లు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లోనే పంటల నమోదు చేస్తారని, రైతులంతా సహకరించాలని కోరారు. రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే ఏఈవోలను సంప్రదించాలని, మోత్కూరు, బుజిలాపురం, అనాజిపురం, పనకబండ గ్రామాల రైతులు ఏఈవో ఆర్.సింహప్రసాద్ (6305215765), పాటిమట్ల, దాచారం, కొండగడప, సదర్శాపురం గ్రామాల రైతులు ఏఈవో జి.సోమప్ప (6305215766), దత్తప్పగూడెం, పాలడుగు, పొడిచేడు, ముశిపట్ల గ్రామాల రైతులు ఏఈవో జి.కల్యాణి (6305215776)లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సింహప్రసాద్, సర్వేయర్ కొమురయ్య, రైతులు పాల్గొన్నారు.